క్లుప్తంగా

ఘనంగా జై మా భగవతి విశాల్ జాగరణ్


వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: ధూల్‌పేటలో మా భగవతి విశాల్ జాగరణ్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాతాదీ అసోసియేషన్ ప్రతినిధులు ఈ వేడుకలు చేపట్టారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్, శిరాజ్ సింగ్, ఇతర నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

సందడిగా స్నాతకోత్సవం



సంతోష్‌నగర్: ఐఎస్‌సదన్‌లోని రవీంద్రభారతి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్నాతకోత్సవ వేడుకలను సందడిగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త లక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యతోనే భావితరాల భవిష్యత్తు బాగుంటుందన్నారు. బుడిబుడి అడుగులతో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. పాఠశాల డీన్ జ్యోతి, అకాడమిక్ ఇన్‌చార్జి పరిమళ, డీఐ దయాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హకీంపేట్‌లో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ లిమ్రా హోటల్ వద్ద ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో నగరంలో హిందూ ముస్లిం మధ్య ఉన్న పవిత్ర స్నేహ బంధానికి ఇఫ్తార్ విందులు అద్దంపడుతాయన్నారు. దశాబ్దాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం రాజకీయాలు, కులమతాలకు అతీతంగా జరుగుతూ వస్తుందని ఆయన అన్నారు. అంతేకాకుండా ఈ విందుల్లో పాల్గొనే యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణను కూడా అలవర్చుకుంటారని ఆయన అన్నారు. ఆయన స్థానికులందరితో కలిసి ఉపవాస దీక్షను విరమించారు. ఈ ఇఫ్తార్ వేడుకల్లో మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్, సయ్యద్ జబ్బార్, అలీమొద్దీన్ తదితరులున్నారు.

31 నుంచి విద్యశ్రీ ఎక్స్‌పో-2023


వివరాలు వెల్లడిస్తున్న స్కూల్ చైర్మన్ శ్యామ్‌వెరా

జియాగూడ: విద్యశ్రీ ఎక్స్‌పో-2023 ఎగ్జిబిషన్‌ను ఈనెల 31న నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్ చైర్మన్ శ్యామ్‌వెరా, డైరెక్టర్ సునితా శ్యామ్‌వెరా అన్నారు. ఈ మేరకు మంగళవారం స్కూల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విద్యాశ్రీ ఎక్స్‌పో-2023 బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం చైర్మన్ శ్యామ్‌వెరా మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో 700 మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల చదివిన పాఠ్యాంశాల నుంచి సేకరించిన సుమారు 500 రకాలు ప్రదర్శనలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మాథ్స్, సైన్స్‌ల పాఠ్యాంశాల నుంచి చదివిన వాటిని విద్యార్థులు ప్రదర్శన ద్వారా వివరిస్తారన్నారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ సంఘ సేవకులు అరవింద్‌కుమార్‌గౌడ్, గోషామహల్ ఏసీపీ సతీష్‌కుమార్, కార్పొరేటర్ బోయిని దర్శన్, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఇందిర సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మూడు నెలలుగా హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా.. రూ.3,39,412 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులు, ఆలయ చైర్మన్ యుగేందర్‌రెడ్డి, ఈఓ జయంతి పాల్గొన్నారు.

మీసాల రాముడి కల్యాణానికి వేళాయె

- రెండో భద్రాద్రిగా వీరవెంకట విజయ రాఘవస్వామి మఠ ఆలయం
- 30న కల్యాణ మహోత్సవం


మాంగళ్యధారణ వేళ (ఫైల్)


రాంలీలా మైదానంలో కిక్కిరిసిన భక్తులు (ఫైల్)

లంగర్‌హౌస్: నిజాం తానీషాల కాలంలో భక్తరామదాసు గోపన్న భద్రాచలంలో జానకీరాములకు ఆలయాన్ని నిర్మించారు. లంగర్‌హౌస్‌లోని త్రివేణి సంగం ఒడ్డున మీసాల రాముడు కొలువుదీరిన శ్రీరామచంద్రజీ మఠం వెలసింది. భద్రాద్రికి, 800 ఏళ్ల చరిత్ర కలిగిన సంగంలోని జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవస్వామి మఠ ఆలయానికి అవినాభావ సంబంధం ఉంది. సాక్షాత్తు శ్రీరామ లక్ష్మణులు మారువేషంలో స్వయంగా ఇక్కడకు వచ్చి విడిది చేసి స్వయంభూలుగా కొలువుదీరిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ పవిత్ర ప్రాంతం రెండవ భద్రాద్రిగా, దక్షిణ కాశిగా విరాజిల్లుతుంది. మీసాల రామయ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాద్రి రామయ్యకు తీసిపోకుండా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు, ఆకాశమంత పందిరిలో సీతా రాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు.



అప్పులు తీర్చే దేవుడు మీసాల రామయ్య..

త్రివేణి సంగంలో కొలువుదీరిన రామునికి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మీసాలు ఉండటం ప్రత్యేకత. అలనాడు నిజాం కాలంలో కంచర్ల గోపన్న భక్తరామదాసు భద్రాద్రి రాముని కోసం భద్రాద్రిలో రామాలయం నిర్మించిన విషయం తెలిసిందే. భక్తరామదాసును గోల్కొండ నవాబు బంధించిన సమయంలో రామలక్ష్మణులు మారువేషంలో వచ్చి 6 లక్షల వరహాల రొక్కం చెల్లించి రామదాసును విడిపించారు. రామదాసును విడిపించడానికి రొక్కం చెల్లించాడని ఇక్కడ స్వామిని వేడుకుంటే అప్పులు తీరుతాయని అప్పులు తీర్చే దేవుడిగా కూడా ఈ మీసాల రాముడిని కొలుస్తున్నారు. గర్భాలయంలో విష్ణు అవతారాలైన లక్ష్మీనర్సింహ, వేణుగోపాల సీతారామ మూడు అవతారాలు ఒకే గర్భాలయంలో ఉండటం ఇక్కడ ప్రత్యేకత. శుక్రవారం స్వామివారి చుట్టూ 108 ప్రదక్షణలు చేస్తే అప్పులు తీరి వివాహాలు జరిగి సమస్యలు తీరుతాయని భక్తుల నమ్మకం.

స్వయంభూగా వెలసిన అర్చాస్వరూపుడు..

జానకీ సమేత వీరవెంకట విజయరాఘవస్వామికి మరో ప్రత్యేకత ఉంది. ఎక్కడయినా విగ్రహాలు శిలలతో చేయిస్తారు. కానీ ఇక్కడ వెలసిన స్వామి వారు సాలిగ్రామ శిలతో వెలసిన అర్చాస్వరూపుడు. తులసీ మాత నారాయణుడికి శిలరూపంలో ఉండాలని శాపం పెట్టిన కారణంగా నారాయణుడు సంజీవ మూర్తిగా సాలిగ్రామ రాయిలో ఉంటారని చరిత్ర. నేపాల్‌లోని ముక్తినాథ్ వద్ద గండకి నదిలో ఈ సాలిగ్రామ రాళ్లు లభిస్తాయని ఈ శిలకు ఎలాంటి ప్రాణ ప్రతిష్ఠ చేయాల్సిన అవసరం లేదని అర్చాస్వరూపుడుగా నారాయణుడు ఇందులో ఉన్నాడని చరిత్ర చెబుతోంది.

కల్యాణ మహోత్సవం..

అయోధ్య రాంచంద్రజీ మఠ ఆలయ ఆధ్వర్యంలో సేవలు అందుకుంటున్న మీసాల రాముడి కల్యాణ వేడుకలు 30న గురువారం మధ్యాహ్నం 12 గంటల 3 నిమిషాల సుముహూర్తాన నిర్వహించనున్నారు. జానకీ దేవి, శ్రీరాముడు స్వయంగా వచ్చి వివాహం ఆడుతున్నారా అనిపించేలా రాంలీలా మైదానంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో లక్షల మంది భక్తులు తిలకిస్తుండగా వివాహ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. చెన్నై నుంచి వచ్చిన కళాకారుల అందమైన గజమాలలతో బ్రహ్మోత్సవాల్లో స్వామిని సుందరంగా అలంకరించనున్నారు. 31న ఉదయం చక్రస్నానం, శ్రీరామునికి మహా పట్టాభిషేకంతో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే..



సంగం శ్రీరామచంద్రీ మఠ ఆలయంలో సాలిగ్రామ శిలతో స్వయంభూలుగా సీతారామలక్ష్మణులు వెలిశారు. రాంలీలా మైదానంలో వేదపండితులతో నిర్వహించే రాములోరి కల్యాణానికి అందరూ పెద్దలే. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు, తలంబ్రాలు స్వీకరించిన వారు కైవల్యప్రాప్తి పొందుతారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సహాయం అందించేందుకు సేవకులు కూడా అందుబాటులో ఉంటారు.

– పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా

శ్రీరామ నవమి శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న డాక్టర్ భగవంత్ రావు తదితరులు

అఫ్జల్‌గంజ్: ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా శ్రీరామ నవమి భారీ శోభాయాత్రను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్ రావు, ప్రధాన కార్యదర్శి గోవింద్ రాఠి, నాయకులు శ్రీరాం వ్యాస్, మహేందర్ వ్యాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిద్దంబర్ బజార్‌లోని బహేతీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ భగవంత్‌రావు మాట్లాడారు. 2010లో శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ శోభాయాత్రను ప్రారంభించామని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం భక్తుల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఈనెల 30న ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణం ప్రారంభమైన అనంతరం సీతారామ్‌బాగ్‌లోని రామాలయం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర మంగళహాట్, పురానాపూల్, చుడీబజార్, బేగంబజార్ ఛత్రి, సిద్దంబర్ బజార్ మీదుగా కోఠిలోని హనుమాన్ వ్యాయమ శాల వరకు కొనసాగుతుందన్నారు. ఈసారి శోభాయాత్రకు ముఖ్యఅతిథులుగా కాశీ నుంచి సుమేరు పీఠాధిపతి శంకరాచార్య స్వామి, నరేంద్రనంద సరస్వతి, రాజస్థాని క్రాంతికారి శ్రీసంత్ భోమారామ్‌జీలు హాజరవుతారని తెలిపారు. అదే విధంగా అంబర్‌పేట్, ఫిల్మ్‌నగర్, ధూల్‌పేట్ నుంచి ఆనంద్‌సింగ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్రలు జరుగుతాయన్నారు.

ఈటల రాజేందర్‌కు ఆహ్వానం

గోల్కొండ: తెలుగు పండుగలు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దంపడుతాయని బీజేపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. ఈ నెల 30న కార్వాన్‌లో జరగనున్న శ్రీరామనవమి శోభాయాత్రలో పాల్గొనాలని కోరుతూ మంగళవారం బీజేపీ నాయకులు ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. ఆహ్వానపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్, అమర్‌నాథ్, ప్రభు పూజారి, సందీప్, అద్దాల కార్తీక్, రక్షిత్, దయానంద్ తదితరులున్నారు.


ఈటలకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే


ఆడిపాడుతున్న చిన్నారులు

గోల్కొండ: చిన్నారులు రంగురంగుల దుస్తులలో ఆడిపాడి అందరిని అలరించారు. టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని బచ్‌పన్ ప్లే స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఇందూ లతారెడ్డి మాట్లాడుతూ.. ఈ వేడుకలు చిన్నారుల ప్రతిభకు అద్దంపడుతాయన్నారు. అనంతరం ఆమె యూకెజీ పూర్తిచేసుకున్న ఐన్‌స్టీన్, న్యూటన్ సెక్షన్ల చిన్నారులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉసామా సుల్తానా, అకాడమిక్ కో ఆర్డినేటర్ అమీనా భాను, నూరి బిన్తే ఫరీద్, ఫర్హా తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: రంజాన్ మాసంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీక తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. రెయిన్‌బజార్‌లో నూతనంగా చేపట్టనున్నా సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రంజాన్ నేపథ్యంలో మసీదులు, ఈద్గాల వద్ద, బస్తీల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. స్థానిక మసీదుల వద్ద ప్రతిరోజూ నిర్వహించే ఇఫ్తార్ విందు కార్యక్రమాలకు ఎలాంటి సమస్యలు రాకుండా ట్రాఫిక్, స్థానిక పోలీసులతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధాన మార్కెట్లు, మసీదులు, హలీం విక్రయకేంద్రాల వద్ద పరిశుభ్ర సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులతో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, స్థానిక మజ్లిస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయండి


మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేష్, అరుణ్‌కుమార్, సంపత్

అబిడ్స్: ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎమ్మెల్సీ యెగ్గె మల్లేష్, రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్ కుమార్, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్ మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్‌కు వినతి పత్రం అందజేసి తెలంగాణ కోసం దొడ్డి కొమురయ్య సేవలు వివరిస్తూ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు క్యామ మల్లేష్, బూరుగడ్డ పుష్ప నాగేష్, ఎక్కాల కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి


ఎస్ఎం ముజీబ్ హుస్సేనిను సత్కరిస్తున్న కొప్పుల దేవేందర్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సేవారత్నా డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ ఉద్యోగులకు అండగా ఉంటున్నట్లు ఆయన వెల్లడించారు. సేవారత్న బిరుదుపొంది నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనిని తెలంగాణ పబ్లిక్ లైబ్రరీస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షుడు కొప్పుల దేవేందర్, ప్రధాన కార్యదర్శి సోమశివయ్య ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఉద్యోగుల సంక్షేమానికి, వారి శ్రేయస్సుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టినప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదెం షఫీ, కేఆర్.రాజ్‌కుమార్, ముఖీద్, వహీద్ మహ్మద్ పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలపై జాతీయ సదస్సు


సదస్సులో పాల్గొన్న వైస్ చాన్సలర్ విజ్జులత, రత్నకుమారి, మునుస్వామి తదితరులు

సుల్తాన్‌బజార్: ఆర్థిక సంస్కరణలపై భావితరాలకు అవగాహన అవసరమని తెలంగాణ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత అన్నారు. టీఎంయూ ఆర్థికశాస్త్ర విభాగం బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలోని టీఎంయూ ఆడిటోరియంలో '30 ఏళ్ల ఆర్థిక సంస్కరణలు సవాళ్లతో కూడిన భారతదేశ రూపాంతరీకరణ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా హాజరైన వైస్‌ఛాన్సలర్ ప్రసంగించారు. ఇలాంటి సదస్సులు నిర్వహించడం వల్ల భావి పరిశోధకులకు ఆర్థిక అంశాలపైన సరైన అవగాహన కలుగుతుందన్నారు. జేఎన్‌యూ ప్రొఫెసర్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శక్తికుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలపైన అవగాహన కలిగించే విధంగా అన్ని అంశాలను కూలంకుశంగా వివరించడం జరిగిందన్నారు. బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరిజరాణి, పీవీ గీతాలక్ష్మి, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, నారాయణ, డాక్టర్ కేబీ రత్నకుమారి, డాక్టర్ మునుస్వామి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, గోపాల్‌జీ

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. జ్ఞాన్‌బాగ్ కాలనీలో రూ.34 లక్షల విలువైన డ్రైనేజీ అభివృద్ధి పనులను రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల ఆధునీకరణ చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, వాటర్ వర్క్స్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'హీరా గ్రూప్ సంస్థపై రాజకీయ కుట్ర'

సుల్తాన్‌బజార్: హీరా గ్రూప్ సంస్థపై రాజకీయ కుట్ర జరుగుతోందని హీరా గ్రూప్ లీగల్ అసోసియేట్ ప్రతినిధులు భాస్కర్, జహ్నవి ఆరోపించారు. తమ సీఈఓ నౌహెరా షేక్ చట్టబద్ధంగా చేస్తున్న వ్యాపారాన్ని కొందరు కుట్రపూరితంగా ఆమెపై ఫిర్యాదులు చేసినట్లు వివరించారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆ తప్పుడు ఫిర్యాదులపై తమ సంస్థ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తున్న తమ సీఈఓ నౌహెరాషేక్ సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. తాము చేస్తున్న న్యాయ పోరాటంలో తొలి విజయంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్‌మెంట్‌ను ఎత్తివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసినట్లు వెల్లడించారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడుపుతున్న తమ సీఈఓపై కొంతమంది కావాలని కుట్రపూరితంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. న్యాయ వ్యవస్థపై గౌరవంతో వ్యవహరిస్తున్న తమ సీఈఓపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో 'కాయకల్ప'


గోల్కొండ ఏరియా ఆస్పత్రి సిబ్బందితో డాక్టర్ యాదయ్య తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్న విషయం ప్రజలకు తెలిసేలా సిబ్బంది కృషి చేయాలని కాయకల్ప అసెస్మెంట్ హెడ్ డాక్టర్ యాదయ్య అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశుభ్రత, క్వాలిటీకి సంబంధించిన కాయకల్ప కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి ఆవరణం, ఓపీ విభాగంతో పాటు క్యాజువాలిటీ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం ఇన్‌పెషెంట్, ఆపరేషన్ థియేటర్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిఒక్క చోట పరిశుభ్రత ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఆస్పత్రి వైద్య బృందం, నర్సింగ్ స్టాఫ్‌తో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పరిశుభ్రత కాపాడటం ఏ ఒక్కరితోనూ అయ్యే పని కాదని, ప్రతిఒక్కరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా తీసుకుని క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అసిస్మెంట్ టీం మెంబర్ ఇందిర, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మహాజర్ ఉల్లా, ఆర్ఎంఓ ఖాజా రవూఫ్ ఉద్దీన్ తదితరులున్నారు.

పోలీసు అధికారులకు సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

చార్మినార్: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు పేట్లబురుజులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు అధికారులకు కార్డియా పల్మనరీ పునురుజ్జీవనం (సీపీఆర్)పై అవగాహన కల్పించారు. అత్యవసరంగా గుండెపోటును నివారించడానికి సీపీ ఆర్ ప్రక్రియను ఎలా ఉపయోగించాలనే విష యంపై ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ చేసి చూపించారు. మానవ శరీరంలో గుండె పైభా గంలో సీపీఆర్ ప్రక్రియను అత్యవసర ప్రక్రియగా వి నియోగించే విధానాన్ని ఆయన స్వయంగా చేసి చూపించ డమే కాకుండా ఇతర పోలీసు అధికారులతో చేయించారు. దాదాపు 422 మంది పోలీసు అధికారులతో పాటు ఏసీపీలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి సత్కారం


మంత్రి తలసానిని సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్, నందుకుమార్ తదితరులు

అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. చుడిబజార్‌లోని హరిజన సేవక్‌మండల్ పైఅంతస్తు నిర్మాణం కోసం మంత్రి రూ.40 లక్షలు నిధులు విడుదల చేయించారు. దీంతో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. హరిజన్ సేవక్ మండలి పై అంతస్తు నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతామన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. నందుకుమార్, హరిజన్ సేవక్‌మండలి నాయకులు కృష్ణ, ధర్మేందర్, దేవేందర్, వెంకటేష్, కిశోర్, రాజు, బాలరాజు, రజని, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాజుల అంజయ్య జన్మదిన వేడుకలు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య జన్మదిన వేడుకలు మంగళవారం మీరాలంమండిలో ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు గాజుల రాహుల్ (గబ్బర్), చలువాది శ్రీకాంత్, కాట రమేశ్, రాకేశ్ తివారీ, మధుసూదన్‌యాదవ్, హన్స్‌రాజ్, కోటిరెడ్డి పాల్గొన్నారు.



ఉప్పుగూడ శ్రీరామ శోభాయాత్రకు తరలిరండి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న శ్రీనివాసారావు

చాంద్రాయణగుట్ట: శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఉప్పుగూడ పురవీధుల్లో నిర్వహించనున్న శోభాయాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీరామ సేన అధ్యక్షుడు తాడెం శ్రీనివాసారావు కోరారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఉప్పుగూడ పురవీధుల్లో రోడ్లకు మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తరింపు, విద్యుద్దీపాలు, వైర్ల సమస్య లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సామ్రాట్‌కు వినతిపత్రాన్ని అందించామన్నారు. ఆయనతో పాటు బందోబస్తు విషయమై దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యకు కూడా విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పెండెం లక్ష్మణ్, గంజి వేణు, గాడిచర్ల బాలరాజ్, సుభాష్, రవి, వెంకటేష్, శ్రీనివాస్, రవికిరణ్, బాబురావు, ప్రదీప్, టిల్లు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా గృహిణి అదృశ్యం


ఆయేషా ఫాతిమా (ఫైల్)

డబీర్‌పురా: ఇద్దరు పిల్లలతో ఓ గృహిణి అదృశ్యమైన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చంచల్‌గూడకు చెందిన సయ్యద్ అక్బర్, ఆయేషా ఫాతిమా (35)లు దంపతులు. వీరికి నలుగురు పిల్లలు సంతానం ఉన్నారు. ఈనెల 17న ఆయేషా ఫాతిమా తన పిల్లలు అర్షియా ఫాతిమా (7), ఆలినా ఫాతిమా (5)లతో కలిసి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన భర్త స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భార్య, ఇద్దరు పిల్లలు కనిపించడం లేదని అక్బర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.